# మళ్లీ ద్రవిడ్‌కే

## భారత చీఫ్ కోచ్‌గా కొనసాగింపు

## సహాయక సిబ్బంది కాంట్రాక్టుల పొడిగింపు

## గడువు ఎప్పటి వరకో వెల్లడించని బీసీసీఐ




**భారత ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కొనసాగింపుపై సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. గత కొన్ని రోజులుగా ద్రవిడ్ భవిష్యత్‌పై వస్తున్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. మరోమారు అతనికే బాధ్యతలు అప్పగిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ద్రవిడ్‌తో పాటు సహాయక సిబ్బంది కాంట్రాక్టు గడువులను పొడిగిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. ఎంత కాలమన్నది బీసీసీఐ స్పష్టంగా పేర్కొనలేదు. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి రాహుల్ మరోమారు జట్టుతో కలిసి పనిచేయనున్నాడు.**

న్యూఢిల్లీ: భారత దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ మరికొన్ని రోజుల పాటు చీఫ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. స్వదేశం వేదికగా జరిగిన ప్రపంచకప్ టైటిల్ వేటలో విఫలమైన నేపథ్యంలో ద్రవిడ్ కొనసాగింపుపై గత కొన్ని రోజులుగా అస్పష్టత నెలకొన్నది. దీనికి ముగింపు పలుకుతూ బీసీసీఐ ద్రవిడ్‌ను మరి కొంత కాలం కొనసాగించేందుకు సిద్ధమైంది. వాస్తవానికి ఇటీవలి ప్రపంచకప్‌తో ఇది వరకు ఉన్న కాంట్రాక్టు గడువు ముగిసింది. ద్రవిడ్ సమ్మతి మేరకు బోర్డు బుధవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. రాహుల్‌తో పాటు సహాయక సిబ్బందిగా వ్యవహరిస్తున్న విక్రమ్ రాథోడ్(బ్యాటింగ్ కోచ్), పారస్ మాంబ్రె(బౌలింగ్ కోచ్), దిలీప్(ఫీల్డింగ్ కోచ్) కాంట్రాక్టులను పొడిగిస్తున్నట్లు బోర్డు అధికారికంగా పేర్కొంది. దీంతో రానున్న దక్షిణాఫ్రికా పర్యటనకు లైన్ క్లియర్ అయ్యింది. ద్రవిడ్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని, గత కొన్నేండ్లుగా టీమ్‌ఇండియా నిలకడగా రాణిస్తున్నదని బోర్డు కార్యదర్శి జై షా పేర్కొన్నాడు. అయితే ఇదిలా ఉంటే కాంట్రాక్టు గడువు ఎప్పటి వరకు అన్నది బోర్డు స్పష్టం చేయలేదు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ లేదా పాకిస్థాన్‌లో 2025లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ దాకా అన్నది ఇంకా తేలాల్సిఉంది. ప్రస్తుతం ద్రవిడ్ గైర్హాజరీలో జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్..ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

**సంతోషంగా ఉంది: ద్రవిడ్**

భారత చీఫ్ కోచ్ పదవి కొనసాగింపుపై రాహుల్ ద్రవిడ్ సంతోషం వ్యక్తం చేశాడు. 'టీమ్‌ఇండియాతో గత రెండేండ్లుగా నా ప్రయాణం చిరస్మరణీయమైనది. ఈ సమయంలో మేము ఎన్నో ఎత్తుపల్లాలను చూశాం. జట్టు సభ్యులతో ప్రయాణం అద్భుతంగా కొనసాగుతున్నది. ప్రపంచకప్ ఓటమి ఒకింత నిరుత్సాహానికి గురి చేసినా..ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగుతాం. భవిష్యత్‌లో ఎదురయ్యే కఠిన సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను' అని అన్నాడు.

**'నో' చెప్పిన నెహ్రా:**

రాహుల్ ద్రవిడ్ తిరిగి కొనసాగేందుకు సమ్మతించని నేపథ్యంలో ప్రధాన కోచ్‌గా పనిచేసేందుకు మాజీ క్రికెటర్ ఆశీష్ నెహ్రాను బీసీసీఐ పెద్దలు సంప్రదించినట్లు తెలిసింది. అయితే ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌తో చీఫ్ కోచ్‌గా 2025 వరకు ఒప్పందం ఉన్న నేపథ్యంలో నెహ్రా అందుకు నో చెప్పినట్లు తెలిసింది. గుజరాత్‌తో ఒప్పందాన్ని గౌరవించేందుకు నెహ్రా మొగ్గుచూపినట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. దీనికి తోడు భారత చీఫ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకుంటే చిన్నపిల్లలైన తన కూతురు, కొడుకును విడిచిపెట్టి ప్రయాణాలు చేయాల్సి వస్తుందన్న కారణంతో బోర్డు ప్రతిపాదనకు నెహ్రా ఓకే చెప్పలేదని సమాచారం. భవిష్యత్‌లో సరైన సమయం వచ్చినప్పుడు పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కు నెహ్రాను కోచ్‌గా పరిగణించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తొలి టీ20లో భారత్'ఎ' గెలుపు

ముంబై : ఇంగ్లండ్-ఎ జట్టుతో బుధవారం ఉత్కంఠగా సాగిన టీ20 మ్యాచ్‌లో భారత్-ఎ మహిళల జట్టు 3 పరుగుల తేడాతో గెలిచింది. 135 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్-ఎ 8 వికెట్లకు 131 పరుగులే చేసింది. ఒక దశలో నాలుగో వికెట్‌కు వైస్‌కెప్టెన్ హోలీ ఆర్మిటేజ్(52), సెరెన్ స్మేల్(31) నాలుగో వికెట్‌కు 70 పరుగులు జోడించి ఇంగ్లండ్ జట్టును పోటీలో నిలిపారు.'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' శ్రేయాంక (2/26) చివరి ఓవర్లో విజయానికి 13 పరుగులు అవసరమైన దశలో 10 పరుగులు మాత్రమే ఇచ్చింది. అంతకుముందు భారత జట్టు 134/7 స్కోరు చేసింది.



## క్వార్టర్‌ఫైనల్లో శివ, అమిత్

షిల్లాంగ్ : ఆరుసార్లు ఆసియా చాంపియన్‌షిప్ గెలిచిన శివ థాపా(63.5కి.), అమిత్ పంగల్(51కి.) జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్నారు. గత టోర్నీలో స్వర్ణం సాధించిన థాపా తన సత్తా చాటుతూ కర్నాటకకు చెందిన సంతోష్‌పై 5-0 తేడాతో గెలుపొందాడు. మరో పోటీలో పంగల్ 4-1తో పంజాబ్‌కు చెందిన జైసందీప్ సింగ్‌పై విజయం సాధించాడు. 92 కిలోల విభాగంలో సంజీత్ 5-0తో సావన్ గిల్‌ను ఓడించాడు. తదుపరి రౌండ్‌లో సంజీత్ ఆర్‌ఎస్‌పీబీకి చెందిన నమన్ తన్వార్‌ను ఢీకొంటాడు.

## హైదరాబాద్ ఓటమి

జైపూర్ : విజయ్ హజారే ట్రోఫీలో బుధవారం హైదరాబాద్ జట్టు 6 వికెట్ల తేడాతో సర్వీసెస్ చేతిలో ఓటమి చవిచూసింది. తొలుత హైదరాబాద్ 210 పరుగులకు ఆలౌటయింది. రాహుల్ బుద్ధి(80), ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(45) రాణించారు. అనంతరం సర్వీసెస్ 40.5 ఓవర్లలో 4 వికెట్లకు 211 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ రాజ్‌పుత్ పలివాల్(77 నాటౌట్), వినీత్ ధన్‌కర్(78) రాణించారు.

# విలియమ్సన్ సెంచరీ

- **న్యూజిలాండ్ 266/8**



విలియమ్సన్ (104)

సిల్హెట్ : బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ రెండో రోజు ఆట ముగిసే సరికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 266 పరుగులు చేసి, బంగ్లా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 44 పరుగుల వెనుకంజలో ఉంది. 9 వికెట్లకు 310 పరుగులతో రెండో రోజు ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ మరో పరుగు జతచేయకుండానే ఆలౌటైయింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్‌కు శుభారంభం దక్కలేదు. ఒకవైపు వికెట్లు కూలుతున్నా విలియమ్సన్ కుదురుగా ఆడి టెస్టులలో తన 29వ సెంచరీ నమోదు చేసుకున్నాడు. మిచెల్(41)తో కలిసి నాలుగో వికెట్‌కు 66 పరుగులు, గ్లెన్ ఫిలిప్స్(42)తో కలిసి ఆరో వికెట్‌కు 78 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 189 బంతుల్లో 11బౌండరీలతో సెంచరీ పూరించిన విలియమ్సన్ 104 పరుగులకు ఏడో వికెట్‌గా వెనుతిరిగాడు. కైల్ జేమీసన్(7), కెప్టెన్ టిమ్ సౌథీ(1) ఆటలో కొనసాగుతున్నారు. తౌజిల్ ఇస్లామ్ 4 వికెట్లు పడగొట్టాడు.

## గనేమత్, అనంత్‌జీత్‌కు టైటిల్స్



న్యూఢిల్లీ : స్కీట్ షూటింగ్‌లో ఎదురులేని గనేమత్ షెకాన్, అనంత్‌జీత్ సింగ్ నరూక మరోసారి తమ సత్తా చాటుతూ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల, పురుషుల టైటిల్స్ సొంతం చేసుకున్నారు.66వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పంజాబ్‌కు చెందిన గనేమత్ మహిళల క్వాలిఫయింగ్ రౌండ్‌లో షూటౌట్ ద్వారా ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్లో 60 షాట్లకు 56 షాట్లు గురితప్పకుండా కాల్చిన గనేమత్ అగ్రస్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జహ్రా దీశవాలా 55 షాట్లతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. సంజన సూద్ 44 షాట్లతో మూడో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగం క్వాలిఫయింగ్‌లో అనంత్‌జీత్ 125 షాట్లకు 123 గురిపెట్టి కాల్చి అందరికంటే ముందు నిలిచాడు. ఆరుగురు తలపడిన ఫైనల్లో కూడా అనంత్‌జీత్ 58/60తో అగ్రస్థానం దక్కించుకున్నాడు. మునేక్ బటూలా (55 షాట్లు), భవతేజ్ గిల్ (45 షాట్లు) వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

## చెన్నైలో ఐఆర్ఎల్

హైదరాబాద్: చెన్నై వేదికగా ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ఎల్)కు రంగం సిద్ధమైంది. డిసెంబర్ 1 నుంచి 17వరకు రేసింగ్ లీగ్ రెండో సీజన్ జరుగనుంది. ఇందులో మొత్తం ఆరు జట్లు..హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్, స్పీడ్ డెమన్స్ ఢిల్లీ, చెన్నై టర్బోరైడర్స్, గాడ్‌స్పీడ్ కొచ్చి, గోవా ఏసెస్, బెంగళూరు స్పీడ్‌స్టర్స్ ఉన్నాయి. ఫార్ములా-4 కార్లతో బరిలోకి దిగుతున్న జట్లు టైటిల్ కోసం హోరాహోరీగా తలపడనున్నాయి. ఈ లీగ్‌లో రేసర్ల వ్యక్తిగతంగా గాకుండా జట్ల ముందంజ ఆధారంగా పాయింట్లు కేటాయించనున్నారు. ఇండియన్ రేసింగ్ లీగ్‌ను చెన్నైకి తీసుకొచ్చినందుకు సంతోషిస్తున్నామని లీగ్ ప్రమోషన్స్ చైర్మన్ అఖిలేష్‌రెడ్డి పేర్కొన్నారు.






# బండి.. ఓటుకు నోటు?

- **కరీంనగర్‌లో డబ్బుల పంపిణీకి వెళ్లి సీసీ ఫుటేజీకి చిక్కిన సంజయ్**
- **మీడియా సమావేశంలో మంత్రి గంగుల కమలాకర్ బహిర్గతం**
- **మద్యం, డబ్బులు పంపిణీ చేయలేదని భాగ్యలక్ష్మి దేవాలయంలో ప్రమాణం చేస్తావా?: గంగుల సవాల్**



*కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో డబ్బుల పంపిణీకి వెళ్లిన బండి సంజయ్ ఆయన అనుచరుల సీసీ ఫుటేజీని మీడియా ముందు ప్రదర్శిస్తున్న మంత్రి గంగుల*

కరీంనగర్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ అడ్డంగా దొరికాడని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో మంగళవారం రాత్రి బండి సంజయ్‌తోపాటు ఆయన అనుచరులు డబ్బుల పంపిణీకి వెళ్లి.. సీసీ ఫుటేజీలో రికార్డు అయిన వివరాలను మంత్రి గంగుల బుధవారం కరీంనగర్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. బండి సంజయ్ తన అనుచరులతో కలిసి రెండు వాహనాల్లో డబ్బులు తీసుకెళ్లి కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని మడిగల వాడలో పంచే ప్రయత్నం చేశారని, ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీని మంత్రి మీడియా ముందు ప్రదర్శించారు. బండితోపాటు ఆయన అనుచరులు డబ్బులు పంచుతున్న వ్యవహారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు వెళ్లి ప్రశ్నించారని తెలిపారు. రాత్రి పూట బండితోపాటు.. కరీంనగర్‌కు చెందిన నాయకులకు కొత్తపల్లిలో ఏం పనంటూ ప్రశ్నించారు. స్థానికులు నిలదీసే సరికి తమ బండారం బయట పడుతుందని భావించి వెంటనే మాట మార్చారని తెలిపారు. డబ్బులను బీఆర్ఎస్ పార్టీయే పంచుతున్నట్టు తమకు సమాచారం వచ్చిందని, అందుకే తాము వచ్చామని బీజేపీ నాయకులు పేర్కొనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకులు డబ్బులు పంచినట్టు సమాచారం వస్తే.. సదరు విషయాన్ని పోలీసులు లేదా ఎన్నికల సంఘానికి ఎందుకు ఫిర్యాదు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఒక ఎంపీగా ఆ బాధ్యత బండి సంజయ్‌కు లేదా? అలాంటప్పుడు ఎందుకు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రచారం చేయరాదన్న విషయం తెలియదా? అని బండిని ప్రశ్నించారు. మరి రాత్రి తొమ్మిది గంటలకు రెండు వాహనాల్లో కొత్తపల్లికి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మూడు సంచుల్లో డబ్బులు తీసుకెళ్లింది వాస్తవం కాదా? చెప్పాలన్నారు. ధర్మం, నీతి గురించి చెప్పే బండి సంజయ్ ఈ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచలేదని భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేసే దమ్ముందా? అని సవాల్ విసిరారు.

## పోలీసుల అదుపులో ముగ్గురు స్థానికేతరులు

ఎల్లారెడ్డి, నవంబర్ 29: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ముగ్గురు స్థానికేతరులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రచారం ముగిసినందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గానికి సంబంధం లేని స్థానికేతరులు ఉండకూడదు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ఇంట్లో స్థానికేతరులు ఉన్నారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా.. కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రవీణ్‌కుమార్, దోమకొండ మండలం అంచనూర్ వాసి సంతోష్ రెడ్డి, హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన వెంకటసాయికుమార్‌లను గుర్తించి, వారిని అదుపులోని తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై గణేశ్ తెలిపారు.

## 1.75 లక్షల ఉద్యోగులు ఓట్లేశారు

- **పోస్టల్ బ్యాలెట్‌పై హైకోర్టుకు నివేదించిన ఎన్నికల సంఘం**

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుమారు 1.75 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలియజేసింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందజేసే విషయంలో ఈసీ అధికారులు చర్యలు తీసుకోలేదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి ఎన్ సురేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. ఈసీ తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్‌దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్లు అందజేశామని చెప్పారు. ఈ నెల 28వ తేదీ నాటికి 1.75 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు. ఈసీ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

## ఇస్రో శాస్త్రవేత్త లలితాంబికకు ఫ్రెంచ్ పౌర పురస్కారం

బెంగళూరు, నవంబర్ 29: ఇస్రో శాస్త్రవేత్త లలితాంబికకు అత్యున్నత ఫ్రెంచ్ పౌర గౌరవ పురస్కారం లభించింది. ఇస్రో డైరెక్టరేట్ ఆఫ్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్‌గా పనిచేసిన ఆమె.. భారత్, ఫ్రాన్స్ మధ్య అంతరిక్ష సహకారంలో అందించిన విశేష సేవలకుగాను ఈ పురస్కారం అందించారు. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి థియరీ మథౌ మంగళవారం బెంగళూరులో ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేశారు.

## పార్లమెంట్‌లో 18 బిల్లులు!


న్యూఢిల్లీ, నవంబర్ 29: వచ్చే నెల 4 నుంచి జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సభ ఆమోదం కోసం 18 బిల్లులను ప్రవేశపెట్టనున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలు జమ్ము - కశ్మీర్, పుదుచ్చేరికి వర్తించేలా రెండు బిల్లులతో పాటు ఐపీసీ స్థానంలో తెచ్చే మూడు చట్టాలకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి. కశ్మీరీ వలసదారులు, పాక్ ఆక్రమిత కశ్మీర్, షెడ్యూల్ తెగల నుంచి నిర్వాసితులైన వారికి చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న సభ్యుల సంఖ్యను 107 నుంచి 114కు పెంచే బిల్లును తీసుకురానున్నారు.

## పన్నూన్ హత్యకు భారత ఉద్యోగి కుట్ర!

- **లక్ష డాలర్లతో ఒప్పందం.. అమెరికా సంచలన ఆరోపణ**
- **నిందితుడు నిఖిల్ గుప్తాపై న్యూయార్క్ కోర్టులో కేసు**



న్యూయార్క్, నవంబర్ 29: ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్‌ను హత్య చేసేందుకు భారత ప్రభుత్వ ఉద్యోగి కుట్ర పన్నాడని, హత్య చేసేందుకు ఈ ఏడాది మేలో అమెరికా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారితో లక్ష డాలర్లు ఒప్పందం కూడా కుదిరిందని న్యూయార్క్ కోర్టులో ఆరోపణలు నమోదయ్యాయి. ఫెడరల్ ప్రాసిక్యూటర్స్ ఆరోపణల ఆధారంగా అమెరికా న్యాయ విభాగం భారత ప్రభుత్వ ఉద్యోగి నిఖిల్ గుప్తా (52)పై కేసు నమోదుచేసింది. ఈ నేరంలో దోషిగా తేలితే నిఖిల్ గుప్తాకు 10 ఏండ్ల జైలు శిక్ష విధిస్తామని న్యూయార్క్ జిల్లా యూఎస్ అటార్నీ మాథ్యూ జీ ఓల్సెన్ బుధవారం తెలిపారు. ఈ కేసులో నిందితుడు నిఖిల్ గుప్తాను చెక్ రిపబ్లిక్ అధికారులు 2023 జూన్ 30న అరెస్టు చేశారు. అతడ్ని అమెరికాకు అప్పగించారా? లేదా? అన్నది తెలియరాలేదు. ఇదిలా ఉండగా, ఈ కేసు విచారణ నిమిత్తం ఇద్దరు అమెరికా నిఘా అధికారులు భారత్‌కు చేరుకున్నారు. దీంతో ఈ ఆరోపణల్లో నిజానిజాల్ని తేల్చేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేస్తున్నట్టు భారత్ ప్రకటించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ మాట్లాడుతూ, 'అమెరికాతో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఈ అంశంపై చర్చించాం. అన్ని కోణాల్లో పరిశీలించేందుకు నవంబర్ 18న ఉన్నతస్థాయి కమిటీని నియమించాం. దీంట్లో తేలిన విషయాల ఆధారంగా భారత్ తదుపరి చర్యలు తీసుకుంటుంది' అని చెప్పారు. భారత్ నిఘా ఏజెంట్లు పన్నూన్ హత్యకు కుట్ర పన్నారని, అయితే ఈ కుట్రను అమెరికా ఎన్ఐఏ అధికారులు భగ్నం చేశారని వారం రోజుల క్రితం 'ఫైనాన్షియల్ టైమ్స్' వార్తా కథనం వెలువరించింది. భారత్ ఈ విధమైన చర్యలకు దిగటంపై అమెరికా అధికారులు ఆందోళన వ్యక్తం చేయటమేగాక, భారత్‌ను హెచ్చరిస్తూ.. వివరణ కోరారని ఆ వార్త కథనం పేర్కొన్నది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.